అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 21 సెప్టెంబర్ 2023 పేజీలు : 04

# ఆ అధికారులు అడిగినంత ఇవ్వాల్సిందే..!





ఇటీవల రవాణాశాఖ అధికారుల దాడిలో దొరికిన వాహనాలు

- ఉన్నతాధికారుల పేరుతో వసూళ్లు
- తరచూ ఇదేం పద్ధతంటూ బాధితుల ఆవేదన

**తాడిపత్రి,సెప్టెంబరు20,ప్రభాతవార్త**

అధికారం చేతిలో ఉందని., తామేం చేసినా చెల్లుబాటు అవుతుందని., ప్రశ్నించే పరిస్థితి లేని రవాణా వాహనాలను లక్ష్యంగా చేసుకొని కొందరు అధికారులు వసూళ్లకు శ్రీకారం చుడుతున్నారు. ఉన్నతాధికారుల పేరు చెప్పి స్వామి కార్యం, స్వకార్యం చక్కదిద్దుతున్నారు. అక్రమంగా రవాణా చేసే వాహనాలపై 'ప్రత్యేక' దృష్టి సారించి రెండు, మూడు ప్రభుత్వ విభాగాల అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న చిన్న తప్పుల నుంచి పెద్ద పెద్ద అక్రమాల వరకు వారి కంట పడితే ఆ అధికారులు అడిగినంత ఇవ్వాల్సిందేనని వాహన యజమానులు వాపోతున్నారు.

### ఉన్నతాధికారుల పేరుతో వసూళ్లు

తాడిపత్రి కేంద్రంగా విధులు నిర్వహించే ఓ అధికారి కార్డు కడతారా..కన్నెర్ర చేయమంటారా అంటూ డిమాండు చేస్తూ కార్డు కట్టని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మేము కూడా ఉన్నతాధికారులకు ఇవ్వాల్సి ఉందని వాహన యజమానులకు హుకుం జారీ చేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. మీరు అక్రమంగా అంత సంపాదిస్తున్నారు..మాకు నెలకు రూ. 5 వేలు కట్టలేరా అంటూ వాహన యజమానులపై ఆయన మండి పడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన అడిగినంత ఇవ్వకపోతే దారికాచి..వేచిచూసి సిబ్బందిని ఉసిగొలిపి అలా మామూళ్లు ఇవ్వని వాహనాలపై గురిపెడుతుంటారని గుసగుసలు వినిపిస్తున్నాయి. రాయలచెరువు కేంద్రంగా ఓ బ్రోకరు అన్ని వాహనాల నుంచి వసూళ్లు చేసి ఆ అధికారికి ముట్టచెబుతుండటంతో సదరు బ్రోకరు వాహనాలకు మినహాయింపు ఇస్తున్నట్లు వాదనలు వినిపిస్తున్నాయి. నామమాత్రపు జరిమానాల సొమ్ము ప్రభుత్వానికి, అక్రమ వసూళ్లు ఆ అధికారికి అంటూ వాహన యజమానులు వ్యంగ్యంగా మాట్లాడుకోవడం పరిపాటిగా మారిందంటేనే ఇక్కడి పరిస్థితి అర్థమవుతుంది.

### రూ. వెయ్యి కట్టి వెళ్లు..!

మా స్టేషన్ల పరిధిలోని దారుల గుండానే మీరు వెళ్లాల్సి ఉంది కాబట్టి ప్రతి నెలా బండికో వెయ్యి కట్టమంటూ కొందరు పోలీసు అధికారులు మామూళ్లకు పాల్పడుతున్నట్లు ఇసుక రవాణాదారులు చెబుతున్నారు. ఇలా రెండు మూడు స్టేషన్లకు రూ. వెయ్యి వంతున ఇస్తున్న విషయం తెలుసుకొని మరో అధికారి నాకు కూడా రూ. 1,500 లు వంతున చెల్లించాల్సిందేనంటూ ఇసుక రవాణా ట్రాక్టర్ల యజమానులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ప్రతి ఒక్కరికి చెల్లిస్తూ అక్రమంగా సరఫరా చేసే ఇసుకకు వినియోగదారులు ఆ స్థాయిలో ధర చెల్లించడం లేదని వారు చెబుతున్నారు. కింది స్థాయి సిబ్బంది నుంచి ఓ స్థాయి అధికారి వరకు చేయి తడపందే ట్రాక్టరు గమ్యానికి చేరుకోదని, ఎదుటి వారు సంపాదిస్తున్నారని ఈ ఊబిలోకి దిగి అప్పుల్లో కూరుకుపోయి అలాగే కొనసాగించాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.

### మాకూ ఖర్చులుంటాయి కదా..!

అక్రమ ఇసుక, అక్రమ మద్యం వంటి వాటిని అరికట్టాల్సిన విభాగానికి చెందిన ఓ అధికారి అంటే అక్రమార్కులకు దడ పుట్టుకొస్తోంది. అలాగని ఆమె నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరించే అధికారి అనుకుంటే మీరు పొరపబడినట్లే. గుత్తి కేంద్రంగా విధులు నిర్వహించే ఈ అధికారికి గుట్కా నుంచి సారా దాకా, ట్రాక్టరు నుంచి టిప్పరు దాకా సంపాదన మార్గాలే. సారా అమ్ముతూ పట్టుపడినా, ఇసుక తోలుతూ దొరికినా, గుట్కా విక్రయిస్తూ కంటపడినా తన పంట పండినట్లేననే పలువురు బాధితులు పేర్కొంటున్నారు. ఇలా పట్టుపడిన వారిలో కొందరు పలుకుబడి ఉపయోగించి పెద్దలతో ఫోను చేయిస్తే రమ్మనండి మాట్లాడి పంపిస్తాను అని చెప్పి, మర్యాదలు చేసి, మంచిగానే పట్టుపడిన వారితో కరెన్సీ లాక్కోవడం ఆ అధికారికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి అక్రమాలతో పాటు ఈ అక్రమ అధికారులను కూడా కట్టడి చేయాలని కొందరు నిజాయితీ గల అధికారులతో పాటు పలువురు వాహన యజమానులు కోరుతున్నారు.

# జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌ను త్వరితగతిన పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి, ఆర్డీఒ మధుసూదన్

**అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌ను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నగరంలోని కృష్ణ కళామందిరంలో బుధవారం నిర్వహించిన అనంతపురం అర్బన్ మండలానికి సంబంధించిన జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అర్జీలు స్వీకరించే కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ భాగ్యలక్ష్మి, ఆర్డీఒ మధుసూదన్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్‌డిఏ పిడి నరసింహారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 48 మంది ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌లను అర్హత కలిగిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా వుంటే అలాంటి వాటిని పరిగణలోకి తీసుకుని త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రవేశపెట్టారు. జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నెంబర్ 1902కి కూడా ఇంటి వద్ద నుండే ఫోన్ చేస్తే ఫిర్యాదు దారు అర్జీని నమోదు చేసుకుని సంబంధిత అధికారికి పంపించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను సిఎంఒ స్థాయిలోనే పర్యవేక్షించడం చేస్తున్నారని నాణ్యతగా గడువులోపు అర్జీలను పరిష్కరిస్తున్నారా లేదా అనేది చెక్ చేయడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా, మండల, సచివాలయం స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని ఇందులో మరో అడుగు ముందుకు వేస్తూ ప్రతి వారంలో బుధవారం, శుక్రవారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలోని బుక్కరాయసముద్రం, పెద్దపప్పూరు, గుత్తి మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద డోర్ టు డోర్ క్యాంపెయిన్ మొదలు పెట్టడం జరిగిందన్నారు. ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే 3,256 సేవల వివరాలు, ఎంపానల్ ఆసుపత్రుల వివరాలు, వివిధ పథకాల గురించి ప్రజలకు తెలియచేసి ఇంటిలో వున్న ప్రతి సభ్యుని యొక్క హెల్త్ రికార్డును నమోదు చేయడం జరుగుతోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం వచ్చిన తరువాత ప్రతి నెలా షెడ్యూల్ ప్రకారం డాక్టర్లు రెండుమార్లు గ్రామాన్ని విజిట్ చేయడం జరుగుతోందని, దీర్ఘకాలిక వ్యాధులు వున్న వారిని మరోసారి పరీక్షించి తదుపరి చికిత్సకు సూచనలు ఇవ్వడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమీషనర్ రమణారెడ్డి, పిఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, ఆర్అండ్‌బి ఎస్ఇ ఓబుల్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్‌రావు, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశువర్ధకశాఖ జెడి సుబ్రమణ్యం, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, మెప్మా పిడి విజయలక్ష్మి, డ్వామా పిడి వేణుగోపాల్‌రెడ్డి, డిఎస్ఒ శోభారాణి, హార్టికల్చర్ డిడి రఘునాథరెడ్డి, ఫిషరీష్ డిడి శాంతి, ఎపిఎంఐపి పిడి ఫిరోజ్‌ఖాన్, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూకొఠారి, వికలాంగుల సంక్షేమశాఖ ఎడి రసూల్, స్పందన తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, నగరపాలక సంస్థ అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దిశా నిర్దేశంతోనే గమ్యానికి..

- లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు- విద్యతోనే పేదరికంపై విజయం సాధ్యం
- అవకాశాలు అందిపుచ్చుకోవాలి - డా.బీ.ఆర్. అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా డీసీఓ మురళీకృష్ణ
- ఐఏఎస్ గంధం చంద్రుడు స్ఫూర్తితోనే ఉద్యోగ సాధన



డీసీవో ఏ.మురళీకృష్ణ



విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న డీసీవో ఏ.మురళీకృష్ణ

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 ప్రభాతవార్త**

విద్యార్థి దశలోనే సరైన దిశను నిర్దేశించుకుంటే ఎంచుకున్న గమ్యాన్ని చేరుకోవచ్చని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయకర్త (డీసీఓ) అంగడి మురళీకృష్ణ తెలిపారు. చదువుకు పేదరికం అడ్డంకి కాదని.. సంకల్పం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని అన్నారు. బాగా చదువుకుంటే పేదరికాన్ని జయించవచ్చని అన్నారు. ఇష్టంగా చదివి.. అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించిన ఆయన ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన ప్రభాతవార్తకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్నో ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. ఆయన మాటల్లోనే..

### కుటుంబ నేపథ్యం...

మాది పరిగి మండలం మోదా గ్రామం. మా అమ్మ నరసమ్మ,నాన్న ఆనంద్ కుమార్ దినసరి కూలీలు. వారికి ఆరుగురు సంతానం. అందులో నాకు నలుగురు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. తాపీపనికి వెళ్లి వచ్చిన సంపాదనతోనే అమ్మా నాన్నలు మమ్మల్ని చదివించారు. మాకు ఏ కష్టమూ రాకుండా కంటికి రెప్పలా చూసుకున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ దాకా చదివించారు. తమ్ముడు అంగడి గోపికృష్ణ కెనరా బ్యాంకు అసి స్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అక్క అంగడి సుజాత మేనేజర్ (ప్రొసెస్ ఇండియా డిజైన్ ఎక్స్‌పోర్ట్).

### విద్యాభ్యాసమంతా స్వస్థలంలోనే...

స్వస్థలం మోదా గ్రామంలోనే ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివాను. హిందూపురంలో ఇంటర్, బుక్కపట్నం డైట్ కళాశాలలో డీఈడీ పూర్తి చేశాను.

### ఉద్యోగ ప్రస్థానం...

నాకు చిన్నప్పటి నుంచి చదువంటే ఇష్టం. పుస్తకాలు బాగా చదివేవాడిని. నా ఆసక్తిని గమనించి మా ఉపాధ్యాయులు ఎంతగానో ప్రోత్సహించేవారు. 2003లో డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశాను. కోచింగ్‌కు వెళ్లే స్తోమత లేకపోయినా ఇంటివద్దే ఉండి ఉపాధ్యాయుల సలహాలతో పుస్తకాలు చదివాను. జిల్లాస్థాయిలో మూడో ర్యాంకు సాధించి టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. అంతటితో ఆగక.. ఉద్యోగం చేస్తూనే అంబేద్కర్ ఓపన్ యూనివర్సిటీ ద్వారా బీఎస్సీ పూర్తి చేశాను. మా తల్లిదండ్రులు, మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఏనలేనిది. పూర్తి నిరాక్షరాస్యులైన మా అమ్మ మమ్మల్ని తీర్చిదిద్దిన తీరు మాకెంతో గర్వకారణం.

### విస్తృతమైన సేవలందించాలని...

అగళి, పరిగి మండలాల్లో ఐదేళ్లపాటు టీచర్ ఉద్యోగం సంతృప్తికరంగానే సాగింది. ఇక్కడ పరిమితంగా విద్యార్థులను తీర్చిదిద్దే అవకాశం మాత్రమే ఉంది. అదే జిల్లాస్థాయి అధికారి హోదా అయితే పరిధి విస్తృతమై మరింతమందికి ఇన్‌స్పిరేషన్ కలిగించవచ్చు. అందుకని ఉపాధ్యాయులు, స్నేహితుల ప్రోద్బలంతో గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాను. ఓ వైపు గ్రూప్స్‌తో పాటు మరోవైపు బ్యాంకింగ్ రంగంపైనా దృష్టి సారించాను. ఒకటిరెండు ప్రయత్నాల్లోనే ఏకకాలంలో నాలుగు బ్యాంకులకు సెలెక్ట్ అయ్యాను. అందులో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాన్ని ఎంచుకున్నా. వివిధ రాష్ట్రాల్లో తొమ్మిదేళ్లపాటు విధులు నిర్వర్తించాను.

### మరోసారి డిపార్ట్‌మెంటల్ ఎగ్జామ్ రాసి...

ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తున్నా నాకు విద్యారంగంపైనే ఎక్కువగా ఆసక్తి. అందుకని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్స్ ఎగ్జామ్ రాసి 2019లో డీసీఓ ఉద్యోగానికి ఎంపికయ్యా. మొత్తం నాలుగు డీసీఓ పోస్టుల్లో మూడు మహిళలకు, ఒకటి జనరల్ (పురుష) పోస్టు ఉన్నాయి. వేలాదిమంది పోటీపడిన ఈ ఒక్క పోస్టుకు నేను సెలెక్ట్ అయ్యాను. మూడున్నరేళ్ల తర్వాత సొంత జిల్లా అనంతపురానికి బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల డీసీఓగా బదిలీపై వచ్చాను. ఒకే సారి కర్ణాటకలోని సెంట్రల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, కాంచీపురంలోని ఐఐటి టిడిఎం లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, డీసీవోగా ఉద్యోగాలు వచ్చాయి. అందులో ఈ ఉద్యోగాల్లో కూడా వేలాది మంది విద్యార్థులకు దిశానిర్దేశం చేయడానికి అవకాశం ఉన్నా...జిల్లా స్థాయి పోస్టుల అయినటువంటి డీసీవో పోస్టును ఎంచుకున్నాను. మా స్నేహితులు గ్రూప్-1,2 అధికారులుగా, అనేక మంది టీచర్లుగా కూడా స్థిరపడ్డారు.

### ఐఏఎస్ గంధం చంద్రుడు స్ఫూర్తితో..

పేద కుటుంబం నుంచి వచ్చిన నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తర్వాత తల్లిదండ్రులతో పాటు స్వగ్రామం మోదాలోనూ ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేశారు. అందరూ అభినందించి మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. నా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు పురుషోత్తమరెడ్డి ప్రోద్బలం.. కిందిస్థాయి నుంచి ఐఏఎస్ అధికారిగా ఎదిగిన ఐఏఎస్ గంధం చంద్రుడు స్ఫూర్తితో నేను ముందుకెళ్తున్నా.

### వైవాహిక జీవితం...

నాది పెద్దలు కుదుర్చిన పెళ్లి. భార్య గృహిణి. మాకు ఇద్దరు అమ్మాయిలు. ఆరు, ఎనిమిది తరగతులు చదువుతున్నారు. జీవితం హాయిగా సాగుతోంది.

### సరైన గైడెన్స్ ఉంటే...

విద్యార్థులు బాగా చదవాలన్న కోరిక ఉండాలి. ఆ విధంగా వారు ఇన్‌స్పైర్ అయితే చదువుపై పట్టు సాధించగలరు. వీరికి సరైన గైడెన్స్ ఇస్తే చదువులో రాణించడంతో పాటు ఉన్నత స్థానాలను అధిరోహించగలరు.

సేవా కార్యక్రమాలు...

విద్యా సంబంధిత సేవా కార్యక్రమాలు చేస్తుంటాను. ఎంతో మంది పేద పిల్లలను బాగా చదువుకోవాలని సలహాలు, సూచనలు ఇస్తుంటాను. అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవచ్చో చెబుతుంటాను. నా స్టూడెంట్లను వాట్సాప్ గ్రూప్‌గా క్రియేట్ చేసి.. వారికి విద్యా, ఉపాధి అవకాశాలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తుంటాను. ఫీజులు కట్టడం, పరీక్షలకు సన్నద్ధం చేయడం చేస్తుంటాను. నా స్టూడెంట్లు ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

### ఆశాజీవిగా ఉండాలి...

బాగా చదువుకున్నా ఉద్యోగాలు రాలేదని నిరాశపడకూడదు. ప్రయత్నాలు చేస్తూ ఉంటే కచ్చితంగా ఉద్యోగం సాధించవచ్చు. మనం చదువుకున్న చదువుకు, విజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగం లేదా ప్రైవేట్ ఉద్యోగం అదీ లేకపోతే స్వయం ఉపాధితో మరికొంతమందికి ఉద్యోగాలు కల్పించే స్టార్టప్ కంపెనీలు పెట్టేలా ఎదగాలి.

### విధి నిర్వహణలో సంతృప్తి...

కాకినాడ డీసీఓగా పనిచేసినపుడు ఓ విద్యార్థి అల్లరచిల్లరగా ఉండేవాడు. తెలివితేటలు ఉన్నా నిర్లక్ష్యం చేస్తుండటాన్ని గమనించి కౌన్సెలింగ్ ఇచ్చాను. ఆ తర్వాత అతడి జీవితం మలుపు తిరిగింది. చదువుపై ఏకాగ్రత పెంచి అత్యున్నత మార్కులతో అబ్బురపరిచాడు. మరచిపోలేని సంఘటన ఇది. ఎంసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించి బీటెక్‌లో ఇటీవలే జాయిన్ అయ్యాడు. తనిఖీల సమయంలో విద్యార్థులతో సమావేశమవుతా. వారితో కూలంకశంగా చర్చిస్తా. వారికి ఏవైనా సమస్యలు, సౌకర్యాల కొరత ఉంటే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, లేదా సీఎస్ఆర్ నిధులు, దాతల సహకారంతో తీర్చడం చేస్తుంటాను.

# 22న తుది జాబితాని ఎన్నికల కమీషన్‌కు సమర్పిస్తాం

- జిల్లాలో 37 వేల ఓట్లను వెరిఫికేషన్ చేశాం - జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, హాజరైన పార్టీల ప్రతినిధులు, అధికారులు

**శ్రీసత్యసాయిజిల్లా, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఈ నెల 22వ తేదిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమీషన్‌కు అందజేయడం జరుగుతుందని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలియజేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో 37 వేల ఓట్లను వెరిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. బుధవారం రేష్నలైజేషన్ ఆఫ్ పోలింగ్ అనే అంశంపై మినీ కాన్ఫరెన్స్ హాలు నందు సమీక్షా సమావేశంను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా ఇన్‌చార్జ్ సంయుక్త కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసౌకర్యం, అవసరం ఉన్న పోలింగ్ కేంద్రాలు జాబితాను పరిశీలించుకొని గురువారంలోపు సమాధానం ఇవ్వాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలంటే కనీసం 1500 ఓటర్లకుపైగా ఉండాలని, పాతభవనాలు, కూలిపోవడానికకి సిద్ధంగా ఉన్నా, వర్షాభావ పరిస్థితుల్లో లీకేజీలుజరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటే పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15, 16 తేదీలలో ఆయా నియోజకవర్గాలో రేషనలైజేషన్ ఆఫ్ పోలింగ్ స్టేషన్‌లో శభాగంగా మారుస్తున్న పోలింగ్ స్టేషన్‌లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేయడం జరిగిందన్నారు. జిల్లాలో కొత్తగా 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయుటకుప్రతిపాదనలు మీదృష్టికి తీసుకు వచ్చామని, ప్రతిపాదించి పోలింగ్ కేంద్రాల సంఖ్య 38, పోలింగ్ కేంద్రం పేరు మార్పుకు 45 ఉన్నాయని తెలియజేశారు. ఇన్‌చార్జ్ సంయుక్త కలెక్టర్ కారీ ్తక్ మాట్లాడుతూ, జిల్లాఓ మొత్తం 1555 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మడకశిర నియోజకవర్గం 236, హిందూపురం 253, పెనుకొండ 261, పుట్టపర్తి 237, ధర్మవరం 287, కదిరి 281 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలియజేశారు. 22వ తేదిన తుదిజాబితాను ఎన్నికల కమీషన్‌కు సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మనోహర్‌నాయుడు, సిపిఎం ఇంతియాజ్, గంగాధర్, వెంకటేష్, సిపిఐ వేమయ్య, ఆంజనేయులు, బిఎస్‌పి ఎ.ఎస్.రాయుడు, వైఎస్ఆర్‌సిపి రంగారెడ్డి, టిడిపి రామాంజినేయులు, జనసేన సుబ్బారామ్, అబ్దుల్, తిరుపతేంద్ర, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల ఈఆర్ఓలు తిప్పేనాయక్, భాగ్యరేఖ, రాఘవేంద్ర, చిన్నయ్య, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, మైనావుద్దీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురికి జీవనదానం చేసిన అనంతపురంకు చెందిన రైతు



అవయవదానం చేసిన సుంకిరెడ్డి

**అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

హృదయాంతరాలను తాకుతూ, అనంతపురంకు చెందిన 55 ఏళ్ల రైతు, ప్రాణాపాయంలో ఉన్న ముగ్గురికి నూతన జీవితాన్ని ప్రసాదించారు. సెప్టెంబర్ 10వ తేది సాయంత్రం 6:30 గంటలకు గుత్తి సమీపంలో తన మోటారు సైకిల్‌ను నాలుగు చక్రాల వాహనం ఢీ కొనడంతో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తర్వాత అపరాల సుంకిరెడ్డిని తక్షణమే దగ్గరలోని కెంపెగౌడ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో చేర్చారు. కానీ గాయాల తీవ్రత కారణంగా ఆ తరువాత స్పందన ఆసుపత్రికి బదిలీ చేశారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో, అధునాతన వైద్యం కోసం సెప్టెంబర్ 11వ తేది ఉదయం 10:30 గంటలకు యశ్వంతపూర్‌లోని స్పర్ష ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్య బృందం కృషి చేసినప్పటికీ, సుంకిరెడ్డి పరిస్థితి క్షీణించింది. సెప్టెంబర్ 14న బ్రెయిన్ డెడ్ ప్రకటించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అంత దు:ఖంలో కూడా కుటుంబం అవయవాలను దానం చేయాలనే ఉదార నిర్ణయంతో ముందుకు వచ్చింది. అతని కాలేయం, కుడి కిడ్నీని యశ్వంత పూర్‌లోని స్పర్ ష ఆసుపత్రిలో రోగులకు విజయవంతంగా మార్పిడి చేయగా, మరో కిడ్నీని ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులోని మణిపాల్ ఆసుపత్రికి పంపారు. ఈ మహోన్నత కార్యక్రమం గురించి స్పర్ ష ఆసుపత్రి గ్రూప్ సిఓఓ జోసెఫ్ పసంఘ మాట్లాడుతూ.. అపరాల సుంకిరెడ్డి యొక్క ఉదారమైన దానము, ఒక వ్యక్తి పలువురి జీవితాలపై చూపే అపారమైన ప్రభావానికి నిదర్శనం, అతని మహోన్నత దానం ప్రాణాలను రక్షించడమే కాకుండా మన దేశంలో అవయవ దానం యొక్క ఆవశ్యకత గురించి అవగాహనను పెంచుతుందని అన్నారు. అవయవ దానం ప్రోటోకాల్స్ ప్రకారం, కర్ణాటక రాష్ట్రంలో శవ అవయవ దానాన్ని పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ సంస్థ స్టేట్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంట్ ఆర్గనైజేషన్ అధికారులు అవయవ దానం ప్రక్రియను ప్రారంభించారు. కుటుంబ సభ్యుల నుండి రాతపూర్వక అనుమతి తీసుకున్నారు. వెయిటింగ్ లిస్ట్ ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేసి అవయవాలను అమర్చారు.

# తానా అంతర్జాతీయ సమ్మేళనానికి పుట్టపర్తి వాసి శ్రీవిద్య



**పుట్టపర్తిటౌన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

తానా అంతర్జాతీయ కవయిత్రీల సమ్మేళనానికి పుట్టపర్తికి చెందిన దొడ్డపనేని శ్రీ విద్యకు ముఖ్యఅతిథిగా ఆహ్వానం అందింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఈ నెల 24న ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్య భేరి శతాధిక కవయిత్రిల సమ్మేళన కార్యక్రమానికి పుట్టపర్తికి చెందిన రచయిత్రి దొడ్డపనేని శ్రీ విద్యను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించిస్తూ బుధవారం కబురు అందింది. విజయవాడ నుండి ఇక్కడకు వచ్చిన శ్రీవిద్యకుటుంబం గత 20 యేళ్ళుగా పుట్టపర్తికి వచ్చి స్థిరపడ్డారు. వివిధ కవితలు, రచనలు చేస్తున్న ఈమెనుతానా ఆహ్వానించడం పట్ల పలువురు సాహితి ప్రియులు,పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రచనలకే పరిమితం కాకుండా ఆమె అనేక రకాలుగా పేదలకు తన వంతు సేవలు అందిస్తున్నారు. 14 గంటల పాటు జరిగే సాహిత్య సమ్మేళనానికి తనకు అవకాశం కల్పించిన తానా అధ్యక్షులు శృంగవరపు నిరంజన్, నిర్వాహకులు డా.తోటకూరప్రసాద్, సమన్వయ కర్త చిగురుమళ్ళ శ్రీనివాస్‌లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## టిడిపి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

**హిందూపురం, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

టిడిపి అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్ట్ చేశారని నిరసిస్తూ ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న క్రమంలో హిందూపురంలో బుధవారం భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎంజిఎం క్రీడామైదానం నుండి వందలాది మహిళలు ర్యాలీలో పాల్గొనగా రైల్వేరోడ్డు మీదుగా కొనసాగింది. ప్లకార్డులు చేతబూని సైకో పోవాలి సైకిల్ రావాలి అని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. మహిళల ర్యాలీకి మున్సిపల్ మాజీచైర్ పర్సన్ రావిళ్ల లక్ష్మీ నేతృత్వం వహించగా ఎమ్మెల్యే బాలకృష్ణ రాజకీయ కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ విపక్షనేత, పట్టణ అధ్యక్షులు డిఇ రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు రామాంజనమ్మ, బేవనహళ్లి ఆనంద్, పరిమళ, నాగరాజు, మనేసముద్రం అశ్వర్థరెడ్డి, కొల్లకుంట శివశంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా డిఎస్‌పి కంజక్షన్ నేతృత్వంలో సిఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. 30యాక్ట్ అమలులో వున్నప్పటికి ర్యాలీలు చేపట్టడంపై పోలీసులు ర్యాలీ నిర్వాహకులపై కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

## మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలి

**హిందూపురం టౌన్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**




మాట్లాడుతున్న బాబావలి

హాస్టల్ విద్యార్థులకు అందించే మెస్, కాస్మొటిక్ చార్జీల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన సౌకర్యాలు అందిస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల కాస్మొటిక్, మెస్ చార్జీలను కూడా చెల్లించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాలుగు నెలల నుండి కాస్మొటిక్ చార్జీలు అదేవిధంగా మూడు నెలల మెస్ చార్జీలు పెండింగ్‌లో వున్నాయని దీంతో పాటు ప్రభుత్వ కళాశాల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా బిల్లులు పెండింగ్‌లో వున్నాయని వీటన్నింటిని వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## గుండుమల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

**అగళి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



దీక్షలో మాట్లాడుతున్న గుండుమల

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని నిష్కారణంగా అరెస్టు చేసి జైల్లో ఉంచినందుకు నిరసనగా మండల కేంద్రమైన అగళిలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఇరలే నిరాహార దీక్షలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై దీక్షలో పాల్గొన్నారు. అచ్చెంనాయుడు, జాతీయ ప్రధాన కార్యయర్శి నారాలోకేష్ ఆదేశాల మేరకు దీక్షలను కొనసాగిస్తున్నట్లు గుండుమల తెలిపారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. విజనరి లీడర్‌చంద్రబాబును ప్రిజనరి లీడర్ జగన్ జైలుకు పంపించారని, తన విజన్‌తో తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేసే చంద్రబాబును కుట్రతో అరెస్టు చేయించారని వారు తెలిపారు. న్యాయం చంద్రబాబు పక్క ఉందని కడిగిన ముత్యంలా వారు బయటికి వస్తారని గుండుమల ఆశాభావం వ్యక్తం చేశారు. దీక్ష అనంతరం కొబ్బరి నీళ్లు స్వీకరించి గుండుమలతోపాటు నాయకులు, కార్యకర్తలు దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కృష్ణమూర్తి, మల్లికార్జున, జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్‌కుమారస్వామి, నాయకులు శ్రీనివాస్‌మూర్తి, క్లస్టర్ శివన్న, మాజీ డీలర్ రాజన్న, వెంకటేష్, తిప్పేస్వామి, రవికుమార్, నరసింహప్ప, షౌకతలి, శివలింగప్ప, ప్రకాష్, వికాస్, బ్యాడిగెర రాజన్న, హనుమప్ప, భూతన్న, సిగనాగప్ప, ఫైనాన్స్ నారాయణప్ప, జైరామ్, ప్రవీన్, భూతరాజు, మాజీ ఎంపిటిసి పుట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చందా వేసుకుని రోడ్డు మరమత్తు



రోడ్డు పనులను జెజిబి ద్వారా మరమత్తు దృశ్యం

**అమరాపురం,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త**

మండల పరిధిలోని గౌడన కుంట గ్రామం నుండి చెరువుపై దేవగానిపల్లితో పాటు ముద్దగానిహళ్లి,క్యాతగానిహళ్లి,లింగలహళ్లి తదితర కర్ణాటక ప్రాతాలకు వేళ్లే గుదతలమయమైన రోడ్డును రైతులు గత మూడు రోజులుగా జెసిబి ట్రాక్టర్ల ద్వారా మన్ను తొలి మరమత్తులు చేశారు.దాదాపు 5 కిలోమీటర్ల వరకు గౌడనకుంట నుండి కర్ణాటక బార్డర్ వరకు వేళ్ళే రోడ్డు గుంతలమయంగా ఉండడంతో అదే రోడ్డుపై నిత్యం వ్యవసాయపనులకు మరియు తోటల పనులకు వెళ్లె రైతులు దాదాపు 45 మంది చందాలు వేసుకుని జెసిబి పెట్టి ట్రాక్టర్ల ద్వారా మన్ను తోలించి గుంతమయంగా ఉన్న రోడ్డును మరమత్తు చేశారు.ఊవరో వస్తారు ఏదో చేస్తారనే సామేతకు ఎదులు చూడకుండా తమకు కావల్సిన రోడ్డును తామే చక్క దిద్దుకోవాలనే సంకల్పంతో దాదాపు లక్ష రూపాయలు వెచ్చించి రోడ్డును మరమత్తు చేయడం ద్వారా వివిధ గ్రామాలకు వెళ్లడానికి రోడ్డు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు ఆ ప్రాంత రైతులను అభినందిస్తున్నారు.దాదాపు 5 కిలోమిటర్ల రోడ్డును మరమత్తు చేయడం హర్షించ దగ్గ విషయం.

## నేటి నుండి ఆధార్ మొబైల్ క్యాంపులు

**అమరాపురం,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త**

మండలంలోని గురువారం బసవనపల్లి,కే.శివరం,నిద్రగట్ట గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ మొబైల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ మునిస్వామి ప్రజలకు తెలియజేశారు. 22న తమ్మడేపల్లి-1,హేమావతి-2, మద్దనకుంట, 23న హలుకూరు-1, అమరాపురం-2 గ్రామ సచివాలయాల్లో ఈ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా వలస,తమ్మడేపల్లి,బసవనపల్లి గ్రామాలలో జగనన్న సురక్ష పథకం కార్యక్రమాలను ప్రారంభిచినట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా గణపతి నిమజ్జనం

**అగళి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఎంఎం పాళ్యం గ్రామంలో ఏర్పాటు చేసిన వరసిద్ది వినాయకున్ని గ్రామస్తులు, యువత అంతా కలిసి చెరువులో నిమజ్జనం చేశారు. ముందుగా స్వామిని వివిధ రకాల పూలతో అలంకరించి, ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న సమయంలో యువత కుంకుమ ధరించి దేవుని పాటలు పాడుతూ నృత్యాలు చేసిన దృశ్యం పలువురిని ఆకట్టుకుంది. నిమజ్జనం అనంతరం ఆలయ మండలి వారు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుడు

**లేపాక్షి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

మండలంలోని సిరివారం గ్రామంలో మారెమ్మ యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం బుధవారం సాయంత్రం భక్తజన సందోహం మధ్యన నిమజ్జనం కార్యక్రమానికి తరలించారు. గత మూడు రోజులుగా మారెమ్మ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి వినాయక లడ్డు వేలం పాట జరిగింది. ఈ వేలంపాటలో గణేష్ అనే యువకుడు 14 వేల రూపాయలకు దక్కించు కున్నారు. బుధవారం ఉదయం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉట్టి కొట్టే కార ్యక్రమంలో యువతి యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం గణేష్ విగ్రహానికి పూజలు నిర్వహించి అనంతరం మారెమ ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తలు వినాయకుని విగ్రహాన్ని నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా దప్పు వాయిద్యాల నడుమ యువకులు కేరింతలు కొడుతూ ఊరేగింపు సాగించారు. అనంతరం మానేపల్లి చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

## నిరసన కార్యక్రమానికి భారీగా తరలిన మహిళలు



నిరసన కార్యక్రమానికి బయలుదేరిన మహిళలు

**లేపాక్షి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

లేపాక్షి మండలంలోని పలు గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ హిందూపురంలో జరుగుతున్న నిరసన కార్యక్రమానికి మహిళలు భారీగా తరలివెళ్లారు. ఇందులో భాగంగా లేపాక్షి మండల టిడిపి కన్వీనర్ జయప్ప, ఎంపిటిసి లలితమ్మల ఆధ్వర్యంలో పలువురు మహిళలు హిందూపురంలో జరిగే నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. అదేవిధంగా మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో వంద మందికిపైగా మహిళలు పట్టణానికి తరలివెళ్లారు. అదేవిధంగా పులమతి, మానేపల్లి, సిరివరం, కోడిపల్లి, కల్లూరు, నాయనపల్లి, కొండూరు తదితర గ్రామాల నుండి అధిక సంఖ్యలో మహిళలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 48 మందిపై కేసు కొట్టివేత



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న వైకాపా నాయకులు

**గుడిబండ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

గుడిబండ మండలంలో గత సార్వత్రిక ఎన్నికల్లో గొడవలకు సంబందించి గుడిబండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఒక వర్గం దాదాపు 48 మందిపై నమోదైంది. ఈ సందర్భంగా విచారణ చేపట్టిన మడకశిర జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి.శివకుమార్ మాట్లాడుతూ.. కేసు కొట్టివేతకు కారణమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ క్రమంలో గుడిబండ మండల కేంద్రంలో జిబి శివకుమార్ అనుచరులు గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూతరాజు, సర్పంచు అశ్వత్, జగదాంబ కిష్టప్ప, ఎంపిటిసి పుష్పలతానాగేంద్ర, వైకాపా నాయకులు నాగరాజు గుప్తా, కరినింగ, రమేష్, ప్యారజాన్, ఇంద్ర, నటరాజు, భోజరాజు, రాహుల్, లింగరాజు, నవీన్ వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

**లేపాక్షి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన దృశ్యం

మండలంలోని నాగనిపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను లేపాక్షి ఎస్ఐ మునీర్‌అహ్మద్ సీజ్ చేశారు. నాగనిపల్లి గ్రామంలో కొందరు ఎలాంటి అనుతులు లేకుండా ఇసుక అక్రమంగా గత కొన్ని రోజులుగా తరలిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొందరు ఇసుకను తరలిస్తున్న విషయాన్ని పోలీసులకు సమాచారం అందచేశారు. వెంటనే ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే నాగనపల్లి గ్రామంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## 23న చింతల ఫలసాయం వేలం

**గుడిబండ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



నాగరాజు నాయక్

గుడిబండ గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న చింతచెట్లను వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డి నాగరాజునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 23న చింతచెట్లను వేలంపాట నిర్వహిస్తున్నామని, ఈ వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు 5వేల రూపాయలు దరాదత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని, షరతులు వర్తిస్తాయని తెలిపారు.

## చంద్రబాబు అరెస్టును బీసి వర్గం తీవ్రంగా ఖండిస్తోంది

**ధర్మవరం రూరల్ ,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త**



నిరసనలు తెలియజేస్తున్న దృశ్యం

మాజీ ముఖ్య మంత్రి ప్రతి పక్ష నేత చంద్రబాబు నాయుడు అరెస్టును బీసి వర్గం వారు తీవ్రం ఖండిస్తున్నారని ధర్మవరం నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు బీసి నిరసనకు మద్దతు పలికారు.అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి ద్వారానే బీసిలకు న్యాయం సరిగిందని,నేడు చంద్రబాబు అరుస్టుపై బీసిలంతా ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చారని,ప్రభుత్వ తీరును వారు ముందు గానే తప్పుపట్టారని తెలిపారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భాం నుంచి బీసిలకు పెద్ద పీట వేసిన విశయాన్ని వారు గుర్తు చేశారు.చంద్రబాబు నాయుడు బీసిలకు రాజ్యాదికారం తీసుకోని రావడం కోసమే వారు పరితపించారని తెలిపారు.ఈ రాష్ట్రం బీసిలకు ఆధికంగా రాజకీయా ప్రాధన్యత ఇచ్చిన మహనీయుడని వారు తెలిపారు. పండుగని సైతం పక్కన పేట్టి గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న ఈ నిరసన కార్యక్రమాలలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. చంద్రబాబు నాయుడు విడుదల అయ్యే వరకు ఈ పోరాటాలే అగవని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోయ రవీంద్ర,మొబైల్ సాయి,కత్తుల బాబ్జి,కేసిగాల్ల శ్రీనివాసులు,అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో జిల్లా పోలీసుల కోలాహలం

**పుట్టపర్తి, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**



ఎస్‌పి కార్యాలయం నందు వినాయక నిమజ్జనంలో పోలీస్‌కుటుంబ సభ్యుల కొలాహలం

గణేష్ నిమజ్జన వేడుకల్లో జిల్లా పోలీస్ కేంద్ర కార్యాలయ పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు ఆనంద డోలికల్లో మునిగిపోయారు. వినాయక చవితి వేడుకలను పురస్కరించు కొని సోమవారం జిల్లా ఎస్‌పి కార్యాలయం నందు నెలకొల్పిన గణనాథునికి ఎస్‌పి ఎస్.వి. మాధవ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, మూడు రోజుల పాటు పూజాది కైంకర్యాలు సమర్పించి యావత్ జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో, సుభిక్షంగా, ప్రశాంతంగా జీవించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో అధినాయకుడైన వినాయకుని ఆశీస్సులు ఉండాలని స్వామి వారిని ప్రార్థించారు. నూతనంగా ఆవిష్కరించిన శ్రీసత్యసాయి జిల్లాలో పోలీస్ కుటుంబ సభ్యులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం నాడు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహిం చగా, ఇందులో పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు, మహిళలు హోలీ తలపించే విధంగా రంగులు చల్లుకుంటూ, కదంతొక్కుతూ ముందుకు సాగారు. గణనాథుడిని గంగలో నిమజ్జనం చేయడంతోపాటు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనానికి తీసుకెళుతున్న వినాయక విగ్రహాలు

**కొత్తచెరువు, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

కొత్తచెరువు మండల కేంద్రం, మండల పరిధిలో బుధవారం వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో దాదాపు 33 విగ్రహాలు ఏర్పాటు చేయగా, మండల పరిధిలోని గ్రామాల్లో 77 విగ్రహాలు ఏర్పాటు అయినట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలియజేశారు. గత మూడు రోజులుగా వినాయక మండపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి రోజైన బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని బుక్కపట్నం రహదారిలో పర్యావరణ హితమైన 10 అడుగుల మట్టి విగ్రహాన్ని రాయల్ యూత్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలువగా, మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన తొలుబొమ్మలాట ఆహుతులను ఆకట్టుకుంది. అలాగే తలమర్లలో భారీ వినాయక విగ్రహాన్ని వాల్మీకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుక్కటప్పం చెరువులో ప్రత్యేక ఏర్పాటు చేసిన ప్రాంతాల యందు విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, నిమజ్జన ఏర్పాట్లలో అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా ప్రజలు పలు రకాల ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వచ్చింది.

## ఘనంగా వినాయక నిమజ్జనం




పట్టణంలో ఊరేగుతున్న గణనాథులు

**పుట్టపర్తిటౌన్, సెప్టెంబర్ 20, ప్రభాతవార్త**

పట్టణంలో వెలసిన వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య గణనాథులను తరలించారు. బుధవారం పుట్టపర్తి, గోకులం, ఎనుములపల్లిలో వెలసిన గణనాథులను పట్టణంలో ట్రాక్టర్ల ద్వారా ఊరేగించారు. గత మూడు రోజులుగా పట్టణంలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక మండపాలలో గణనాథులను నెలకొల్పి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజైన బుధవారం యువత రంగులు చల్లుకుంటూ, కేరింతలతో దప్పు వాయిద్యాల నడుమ గణనాథులను సాహెబ్ చెరువు, ఎనుములపల్లి చెరువులకు తరలించి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా సిఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందో బస్తు చర్యలు చేపట్టారు.

**వేలంలో వేలుపలికిన లడ్డూ :**గణనాథుల కోసం ఏర్పాటు చేసిన లడ్డును పలువురు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. పట్టణంలోని వివేకానంద రోడ్డులో వెలసిన గణనాథుని కోసం చేసిన లడ్డును బెస్తసాయినాథ్ రూ.70 వేలకు దక్కించుకున్నారు. అలాగే గోపురం నాలుగవ క్రాస్‌లో ప్రవీణ్ సాయి రూ.52 వేలకు దక్కించుకున్నాడు.

## పట్టణ పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి



పురవీధులను శుభ్రం చేస్తున్న దృశ్యం

**ధర్మవరం రూరల్,సెప్టెంబర్ 20,ప్రభాతవార్త**

పట్టణ పరిశుభ్రతకు ప్రజలు భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని, అప్పుడే పట్టణ ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి,మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం ధర్మవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛందా లీగ్ 2.0 అండ్ సఫారీ మిత్ర సురక్ష సివిల్ ధర్మవరం గ్రీన్‌గన్నర్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్,మున్సిపల్ కమీషనర్లతో పాటు,మున్సిపల్ వైస్ చైర్మన్లు వేముల జయరాంరెడ్డి,శంషాద్ బేగం,వైసిపి ఇంచార్జ్ నాయకులు చాంద్ భాషా,కాచర్ల అంజి కౌన్సిలర్లు చెలిమి పెద్దన్న,మున్సిపల్ మేనేజర్ ఆనంద్,జేఈఓ శ్రీనివాసులు,శానిటరి ఇన్స్పెక్టర్లు మహబూబ్ భాషా,శామ్సన్,మేస్త్రీ పార్థసారధి,సచివాలయ శినిటరి సెక్రటరీలతో పాటు సచివాలయ ఉద్యోగులు 31 మంది కలిసి పరక చేత పట్టుకోని మున్సిపల్ కార్యాలయం నుండి కదిరి గేట్ వరకు చెత్తను ఊడుస్తూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయ వంతం చేశారు.ఈ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని పరిపూర్ణంగా నిర్వహించినప్పుడే పట్టణ పరిశుభ్రతకు ఆవకాశం ఉంటుందని,దీనిని అందరూ కూడా నిరంతర ప్రకీయగా చేపట్టినప్పుడే పట్టణంలో ఆరోగ్యం వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు,మేస్త్రీలు,శానిటరి సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## రిలేనిరాహార దీక్ష

**పెనుకొండ, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

నారా చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టు, పార్టీ శ్రేణులపై జరిగిన దమనకాండ, జగన్‌రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాలు తెలుగు రైతు, బిసి కమిటీల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సామూహిక రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో జివిపి నాయుడు, చిన్నప్పయ్య మునిమడుగు వెంకటరాముడు, గిరిధర్‌గౌడ్, రొద్దం నరసింహులు, రఘువీరాచౌదరి, లక్ష్మినారాయణరెడ్డి, రాంపురం సర్పంచు శ్రీనివాసులు, పోతిరెడ్డి పెనుకొండ నియోజకవర్గ తెలుగు రైతులు, బిసి కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వినాయక ఉత్సవాలు

**- భక్తుల నడుమ నిమజ్జనోత్సవం**





ఊరేగింపుగా వెళుతున్న వినాయకులు

**బత్తలపల్లి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

మండల కేంద్రంతో పాటు వివిద గ్రామాలలో కొలువుదీరిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం భక్త జనసందోహం నడుమ కోళాహలంగా ముగిసింది. బుధవారం మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో నెలకొల్పిన వినాయక విగ్రహాలను మూడు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం సమీప చెరువులలో నిమజ్జనం గావించారు. బుధవారం మధ్యాహ్నం నుండి వినాయక విగ్రహాలను అందంగా అలంకరించిన ట్రాక్టర్లలో ఎత్తుకుని పురవీధులలో ఊరేగించారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ గణపతి బప్పా మోరియా అంటూ కేకలు వేస్తూ చెరువుల వద్దకు చేరుకున్నారు. ఊరేగింపు ముందు టపాసులు పేలుస్తూ సందడి చేసుకుంటూ డప్పుల మోతల మధ్య వైభవంగా గణనాథుని సాగనంపారు. ఆయా గ్రామాల సమీపాన వున్న చెరువులో నిమజ్జనం చేశారు. ఈ వేడుకలలో ఎటువంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా ఇంచార్జ్ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఏఎస్ఐ సోమశేఖరమూర్తిలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. చిత్రావతి పరివాహక గ్రామాలలో కొలువుదీరి వినాయకులను చిత్రావతి నదిలో నిమజ్జనం గావించారు.

## చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పోస్టుకార్డుల ఉద్యమం



పోస్టుకార్డులను చూపుతున్న గోనుగుంట్ల వర్గీయులు

**ధర్మవరం టౌన్, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ ఎంఎల్ఎ గోనుగుంట్ల సూర్యనారాయణ అనుచరులు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. బుధవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్‌నందు జనంతో మమేకమైన అనుచరవర్గం ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. చంద్రబాబునాయుడుకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ లక్ష పోస్టు కార్డుల ద్వారా రాష్ట్రపతికి సమాచారం పంపనున్నట్లు వారు తెలిపారు. అక్రమకేసులను బనాయించి చంద్రబాబును జైలుకు పంపిన రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కార్డులను పంపనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబుపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న విధానాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా లక్ష మందితో కార్డులను రాయించి రాష్ట్రపతి దృష్టికి తీసుకపోతామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్ళి పోస్టు కార్డుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారని వారు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వానికి సద్బుద్ది ప్రసాదించాలని కోరుతూ ఈ సందర్భంగా వారు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అబాసుపాలు చేసి ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆనందోత్సవాల మధ్య వినాయక నిమజ్జనం

**రామగిరి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



వినాయకుని నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువకులు

మండలంలోని పలు గ్రామాలలో వినాయక విమజ్జనోత్సవాన్ని బుధవారం ఆనందోత్సవాల నడుమ జరుపుకున్నారు. మూడు రోజులపాటు వినాయక ప్రతిమలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి సమయాల్లో వినాయక మండపాల వద్ద పాటలు, పూజలు చేశారు. బుధవారం సాయంత్రం అన్ని గ్రామాలలో వినాయక ప్రతిమలను ఎద్దులబండ్లు, ట్రాక్టర్ వాహ నాలలో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా గ్రామాల సమీపంలోని కుంటలు, చెరువులలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా సందడి చేశారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ ఎంతో ఉపయోగపడింది

**రామగిరి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ పొందిన పోలూరు మాధవ

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి వల్ల ఆరోజు ఆయన ఇచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్ మాకు ఎంతో ఉపయోగపడిందని మండలంలోని దుబ్బార్లపల్లి గ్రామానికి చెందిన రైతు రంగనాయకుడు కుమారుడు పోలూరు మాధవ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని అందులో జరిగిన అవినీతి ఎక్కడుందో కూడా తెలపలేదన్నారు. తాను అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కాలేజ్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తీసుకుని ఐటి రంగంలో ఏడాదికి రూ.14 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నానన్నారు. ఈ ప్యాకేజీ రావడానికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో పొందిన శిక్షణ ఉపయోగపడిం దన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాతోపాటు ఎందరో ఈ సంస్థలో శిక్షణ పొందారని, తామంతా నిరసనలో పాల్గొనేందుకు సిద్దంగా ఉన్నామని చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని, అక్రమ కేసును కొట్టివేయాలని డిమాండ్ చేశారు.

## ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

**కనగానపల్లి, సెప్టెంబర్ 20 ప్రభాతవార్త**



ఈఓఆర్డి అనిల్‌కుమార్

ఈ నెల 30వ తేది నుంచి అక్టోబర్ 21వ తేది వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అనిల్ కుమార్ తెలిపారు. ఈ నెల 30వ తేదిన ఎలక్కుంట్ల అక్టోబర్ మూడో తేదిన ముక్తాపురం, మద్దెల చెరువు 1లో 5వ తేదిన మద్దెల చెరువు టు ఏడవ తేది. దాదులూరు 9వ తేది కుర్లపల్లి తండా 10న, కోనేటి నాయుని పాళ్యం 12న, తూముచెర్ల 16న, ముత్తవకుంట్ల 18న, నరసంపల్లి 19న, తూముచేర్ల 21 తేదీన ఆయా గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇందులో టీం వన్‌లో తహశీల్దారు, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, మండల విద్యాశాఖ అధికారి2, టీం 2లో ఎంపిడిఓ, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఈ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు కచ్చితంగా పాల్గొనాలని ఈఓఆర్డి అనిల్‌కుమార్ తెలిపారు.

